కే.నం 74800


*శ్రమ జీవులకు విశ్రాంతి అవసరం అంటారు విజ్ఞులు. కాదనడానికి వీలు లేదు. కాని, జీవిత మంతా శ్రమించిన ప్రాణికి వ్యాపకం అంటూ ఏమీ లేని స్థితి మృత్యువుతో సమానం. ఆత్మ గౌరవానికి గొడ్డలి పెట్టు. ఇది అనుభవం.*

**మార్చి** పన్నెండో తారీఖున పరంధామయ్య రిటైరయ్యారు. ముప్పయి రెండేళ్ల ప్రభుత్వోద్యోగం చేసి, రిటైరు కావడం అంటే తెలుగులో ఫించను పుచ్చుకోవటమనే అర్థం కొన్నిచోట్ల ఉంది. ఇదివరకు ఈ అర్థమే సర్వత్రా ఉండేది. ఇప్పుడు 'కొన్నిచోట్ల' అయింది. దానికి కారణం ఉంది. ఈ రోజుల్లో రిటైర్ కాగానే ఫించను వస్తుందని ఏపాటి ప్రభుత్వ కార్యకలాపాలు తెలిసిన వాడయినా అనుకోడు. మామూలుగా ఎవరికయినా సంవత్సరం దాటాక గాని పింఛను అందదు. ఈ కాలం ఒక్కోచోట అయిదారు సంవత్సరాలకు కూడా పెరగటం కద్దు. సరియైన లెక్కలు దొరకవు గాని పెన్షన్ తీసుకోకుండానే చచ్చిపోయిన ఉద్యోగులు పదిమందికి ఒకరో ఇద్దరో ఉంటారు.

ఆ సాయంత్రం ఆఫీసులో ఒక విందు జరిగింది. పరంధామయ్య ముప్పయి రెండు సంవత్సరాలు సర్వీసు చేసినా అప్పర్ డివిజన్ క్లార్కుగానే రిటైరు కావటం చాలా విచారకరం అని ఒకళ్లిద్దరు నాలుగు మాటలు చెప్పారు. సమావేశానికి హాజరయిన ఆఫీసరుమటుకు ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కడూ ఆఫీసరు కాడనీ, ప్రమోషన్ రాకపోయినా ఉన్న ఉద్యోగంలో ఏమాత్రం అశ్రద్ధ చూపకుండా జాగ్రత్తగా పనిచేయటమే పరంధామయ్య ప్రత్యేకత అనీ, అదే అందరూ అలవాటు చేసుకోవాలనీ అన్నాడు.

రాత్రి ఎనిమిది గంటలకు ఒకచేత్తో దండలూ, మరో చేత్తో పళ్లూ పట్టుకొని "ఇక వెళ్లి వస్తాను" అని అందరికి చెప్పి బయలుదేరుతుంటే పరంధామయ్య కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ముప్పయి రెండేళ్లు సేవ చేసిన తరువాత ఇప్పుడు





# పాపం! పరంధామయ్య!!

**వేమూరి సుబ్రహ్మణ్యం**



## పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరగబోతున్నదిన్నీ, మీ సరియైన చర్యను గురించిన్నీ మీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి మీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని మీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు వివాహము, స్త్రీ సుఖము, సంతానము, విధి విక్షేపములు, లాటరీ, ఆకస్మాత్తు ద్రవ్య లాభము మొదలగు వానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేమయినా వున్న యెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మాపూచీపైన పంప బడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయ బడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయుండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (AW-3) Jullundur City**

## 18 మూలికలతో తయారుచేయబడిన ప్రప్రథమ



## ఆయుర్వేదిక
### పేస్టు మరియు పౌడరు

మామూలుగా శుభ్రపరచటముంటే ఏ పేస్టైనా పౌడరైనా చేయగలదు కాని. చిగురులను వృథ పరచే వస్తువులు వాటిలో ఉన్నవా అని ఆలోచించు దారా ప్రప్రథమ ఆయుర్వేదిక 'విక్కో వజ్రదంతి (పేస్టు మరియు పౌడరు) లోగల 18 మూలికలు మీ చిగుళ్ళను గుణపరచి, పళ్లను గట్టిగానుంచును తొలిసారి ఉపయోగములోనే సంతృప్తినిచ్చును

## విక్కో వజ్రదంతి
### పేస్టు మరియు పౌడరు







**Vicco Laboratories Private Limited**
DADAR T.T.-BOMBAY-14.


# పాపం! పరంధామయ్య!!

తన అవసరం ప్రభుత్వానికి తీరిపోయింది! అటూ యిటూ చూసి ఎవరూ లేరని నిర్ధారణ చేసు కొని, పళ్ళ రెండో చేతిలోకి మార్చుకొని, పై ఉత్తరీయం పెట్టి కళ్ళు తుడుచుకొన్నాడు.

పరంధామయ్య యింటికి చేరేటప్పటికి ఆయనకోసం భార్య మహాలక్ష్మి, కొడుకు సుందరం, కోడలు కమల మేల్కొని ఎదురు చూస్తు న్నారు. ఆఖరి కొడుకు మూరిబాబు ఇంట్లో కూర్చుని ఇంగ్లీషు పాఠం పెంకు లెగిరిపొయ్యే టట్టు చదువుతున్నాడు.

"ఏమండీ, మీటింగు బాగా జరిగిందా?" అంటూ మహాలక్ష్మి భర్త చేతిలోని పూలదండలూ పళ్లూ అందుకొన్నది. మామగారిని చూసి కమల లోపలికి వెళ్లింది.

"ఆఁ! బాగానే జరిగింది" అన్నాడు. మళ్లీ తనలో తానే, "యివ్వాల్టితో నాకూ ఆఫీసుకూ ఋణం తీరిపోయింది" అనుకొంటున్నట్టుగా గొణుక్కున్నాడు.

తండ్రి అన్న ఆఖరి మాటలు సుందరం విన్నాడు. "అదేమిటి నాన్నా! దిక్కుమాలిన సర్వీసు వదిలిపోయిందే చాలని హాయిగా రెస్టు తీసుకోక అల్లా బాధపడతారేమిటి?" అన్నాడు. అతడు రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్నాడు.

కొడుక్కు మాటగా సమాధానం చెప్పకుండా పరంధామయ్య, "అందరూ భోజనాలు చేశారా?" అని అడిగాడు.

"ఏదీ? బాబు మటుకు తిన్నాడు. మేం మీ కోసరమనే కాచుక్కూచున్నాం" అన్నది మహాలక్ష్మి.

"మను సరేలే. పిల్లిద్దరూ ఇంకా తినలేదా? అరెరె! అయితే కానీయ్. తొందరగా వడ్డించెయ్. నే వస్తున్నాను" అంటూ నీళ్ళు పోసుకోవడానికి వెళ్లాడు.

ఆ రాత్రి మంచంమీద పడుకొన్నాడన్న మాటేగాని పరంధామయ్యకు నిద్ర పట్టనేలేదు. అటూ ఇటూ దొర్లుతూనే ఉన్నాడు. ఇన్నేళ్ళు చేసిన ఉద్యోగం వదిలివెయ్యాలంటే అతడి మన స్సంతా వికలమయి పోయింది. దగ్గరి బంధువు చచ్చినట్టుగా బాధపడుతున్నాడు.

తెల్లవారిన తరువాత మొహం కడుక్కొని కాఫీ తాగుతూ, "ఇవ్వాళ కూడా మామూలుగా పదింటికి వంట చెయ్యి. అన్నం తిని ఆఫీసుకు వెడతాను" అన్నాడు భార్యతో.

మహాలక్ష్మి ఆశ్చర్యంతో "ఇంకా ఆఫీసేమిటండీ?" అన్నది.

"నీకు తెలియదులే. ఛార్జి పూర్తిగా ఇవ్వ లేదు. అందుకని వెళ్లాలిలే."

అందరితోపాటు పదిన్నరకు ఆఫీసుకు వచ్చిన

పరంధామయ్యను చూసి అందరూ ఆశ్చర్య పోయారు. "ఇదేమిటండోయ్. మీరూ వచ్చారే" అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.

"మీరూ వచ్చారే" అన్న మాటలకు పరంధా మయ్య నొచ్చుకొన్నాడు. పైకిమటుకు కొద్దిగా నవ్వి, "ఏం లేదండీ! ఇంకా ఛార్జి పూర్తిగా యివ్వలేదండీ. అందుకని..." అన్నాడు.

"అదేమిటి? నారాయణమూర్తి ఛార్జి పూర్తిగా తీసుకొన్నానని చెప్పాడే?"

"అబ్బే! క్రొత్తగా ప్రమోట్ అయిన అతడి కేం తెలుసు..." అంటూ నిన్నటిదాకా తను కూర్చున్న సీటు దగ్గరికి వచ్చాడు పరంధామయ్య. ఆ సీటులో కొత్తగా ప్రమోషన్ అయి వచ్చిన నారాయణ మూర్తి కూర్చుని ఉన్నాడు. అది చూడగానే పరంధామయ్యకు మనస్సు చివుక్కు మన్నది. ఆ సీటులో కూర్చోవటానికి తనకు నిన్న సాయంత్రందాకా ఉన్న అధికారం ఇప్పుడు లేదు!

పరంధామయ్యను చూడగానే నారా యణ మూర్తి ఆశ్చర్యంతో, "అదేమిటండోయ్? ఇట్లా వచ్చారు? రండి, కూర్చోండి" అంటూ ఎదురుగా ఉన్న కుర్చీ చూపించాడు.

పరంధామయ్య కుర్చీలో కూర్చుంటూ, "నిన్న ఛార్జి యివ్వటంలో ఆ స్టోర్సురిజిష్టరు సంగతిచెప్ప టం మరిచి పొయ్యాను. అది అప్—టు—డేట్ చెయ్యాలి. అందుకని వచ్చాను" అన్నాడు.

"అందులో పెద్ద కొంప మునిగిపోయిం దేముందండీ! దీనికోసరం మీరు పని గట్టుకు రావాలా? నేనే ఏదో చేసేవాడినిగా?"

"బాగుందండీ. బాధ్యత అనేది ఒకటి ఏడి స్తుంది కదండీ."

ఆ రోజు సాయంత్రం నాలుగున్నర దాకా పాతసీటులో కావాలని కల్పించుకొని ఏదో ఒకటి చేస్తూనే ఉన్నాడు పరంధామయ్య! నాలుగున్నర తరువాత వెళ్లాలని లేచాడు. సర్వీసులో ఉన్నంతకాలం ఎప్పుడూ ఆరున్నరకు గానీ సీటు లోంచి లేచేవాడు కాదు. ఇవాళ నాలుగున్నరకే వెళ్లిపోతుంటే అంతా కొత్తగా ఉంది. "ఇక వెళ్లి వస్తానండీ" అన్నాడు మానేజరు గదిలోకి వెళ్లి.

"అయ్యో, మీరు అనవసరంగా శ్రమ తీసు కున్నారు. నారాయణమూర్తి తెలివిగలవాడే. ఎట్లాగో సర్దుకు పొయ్యేవాడుగా" అన్నాడు మానేజరు.

"తెలివిగలవాడే ననుకోండి. అయినా సీటు కష్టమైంది కదండీ,కొన్నాళ్లు గైడెన్సు ఉండాలి."

"సరేలెండి."

మేనేజరు 'రోజూ వస్తూ ఉండండి' అంటా డేమోనని పరంధామయ్య ఆశించాడు. ఆ మాట ఆయన నోటివెంట రాకపొయ్యే సరికి కొంచెం నిరాశతో బయలుదేరాడు.

ఆ మరునాడు కూడా ఆఫీసుకు వెడతాననే సరికి మహాలక్ష్మి చిరుకోపంతో, "అదేమిటండీ? మీకేమయినా మతిపోయిందేమిటండీ? రిటైరయి యింకా ఆఫీసేమిటీ? హాయిగా ఇంట్లో కూర్చోక?" అన్నది.

సుందరం కూడ అప్పుడు అక్కడే ఉన్నాడు. "అవును నాన్నా! ఇంకా మీకు ఈ బాదరబందీ ఎందుకూ హాయిగా కూర్చోక" అన్నాడు.

పరంధామయ్య "నాకు మటుకు వెళ్లాలని ఉందేమిట్రా? ఇంకా కొంత హాండోవరు చెయ్య లేదు. అందుకనే వెడుతున్నాను" అన్నాడు. పైకి అట్లా అన్నాడే కాని అసలు కారణం అది కాదు. పరంధామయ్యకు వేళకు ఆఫీసుకు వెళ్లట మనేది ఇన్ని సంవత్సరాలుగా సంక్రమించిన ఒక అంటు వ్యాధి. అది వదుల్చుకోలేకుండా ఉన్నాడు. ఆ సంగతి ఆయనకూ తెలుసు.

ఆరోజు మానేజరును చూసి పరంధామయ్య విష్ చేసినపుడు ఆయన యింకేమీ మాట్లాడ కుండా "గుడ్‌మార్నింగ్" అని తన పని చూసు కోవటం మొదలుపెట్టాడు. పరంధామయ్య మనస్సులో కొద్దిగా బాధపడ్డాడు. అయినా తమాయించుకొని లోపలికి వెళ్లి నారాయణ మూర్తి సీటు దగ్గరికి వెళ్లాడు. నారాయణ మూర్తి ఈయనను చూసి ఊరికే "కూర్చోండి" అంటూ మళ్లీ తన పనిలో మునిగిపొయ్యాడు.

"కలెక్టరుకు పంపవలసిన క్వార్టర్లీ రిపోర్టు వెళ్లిందా?" అన్నాడు పరంధామయ్య.

నారాయణమూర్తి తలెత్తి చూశాడు. అతడి ముఖంలో స్పష్టంగా చికాకు కనిపిస్తున్నది. "వెడుతుంది లెండి. అంత తొందరేముందీ?" అన్నాడు.

"అయ్యయ్యో! అట్లా కాదు. అది వెళ్లక పోతే కలెక్టరు ఘాటుగా డి. ఒ. వ్రాసేస్తాడు."

"వ్రాస్తే వ్రాసుకోనివ్వండి. అయినా ఇప్పుడు కుదరదు. మెల్లిగా చూచి పంపిస్తాను లెండి."

"పోనీ ఆ ఫైలు యిటు పారెయ్యండి. నేన యినా వ్రాసేస్తాను."

"అయినా రిటైరయ్యారు కదా? ఇంకా మీకీ బాదరబందీ అంతా ఎందుకండీ?" అన్నాడు నారాయణమూర్తి కొంచెం విసుగుతో.

దానితో పరంధామయ్య నొచ్చుకొన్నాడు. మరి మాట్లాడలేదు. ఆ పగలంతా అట్లాగే ఆఫీసులో కూర్చొన్నాడు. ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటున్నారు. అప్పు డప్పుడు ఎవరేనా ఒకళ్ళిద్దరు వచ్చి పలకరించినా రెండు మూడు నిమిషాలు మటుకే. వాళ్ళల్లో వాళ్ళు మటుకు బాతాఖానీ వేసుకొంటున్నారు. అంతేకాని వీళ్ళలో ఎవరూ ఆయనతో ఎక్కువ సేపు మాట్లాడటం లేదు. మాట్లాడిన రెండు నిమిషాల్లోనూ, 'ఇంకా మీరు యీ ఆఫీసుకు రావటం ఎందుకండీ? హాయిగా యింటిదగ్గర రెస్టు తీసుకోరాదా?' అన్నట్లుగా మాట్లాడు తున్నారు. పరంధామయ్య 'అప్పుడే నన్ను వీళ్ళు పరాయి వాడి క్రింద జమకట్టేశారు' అను

(తరువాయి 49 వ పేజీలో)

డబ్బు సమున్నా బాం కోలా (పొడుం)
దగ్గు-ఆయాసమును అతిత్వరగా నివారించును
అన్ని మందుల షాపులలో దొరకును
బొంకోల ప్రైవేటు లిమిటెడ్, కలకత్తా.
ఆంధ్రప్రదేశ్ జనరల్ డిస్ట్రిబ్యూటర్సు
శ్రీ వెంకటేశ బ్రదర్సు
గోపాలరెడ్డి రోడ్డు విజయవాడ-2

నారసింహ లేహ్యం
బంగారు చేరినది. మేహము, నిస్సత్తువ, నిస్సత్తువను హరించి వీర్యవృద్ధిని, బల మును, రక్తవృద్ధిని కలిగించును.
20 తు డబ్బీ రు. 3-8-0.
రోజాపుష్ప లేహ్యము
అజీర్ణం, గర్భవాతం, మలబద్ధకం హరించి చక్కగా విరేచ నమును, జీర్ణశక్తిని కలిగించును. 15 తు. డబ్బీ రు.1-4-0; పోస్టేజి రు.1-1-0.
మా క్యాటలాగు, కాలండరు ఉచితం.
పి. సి. ఏ. అండ్ కో, ఆయుర్వేద సమాజం, పెరిదేపి, నెల్లూరు జిల్లా.

గజ్జి దురద
మీ చర్మములోగల కోట్లకొలది సూక్ష్మరంధ్రము లలో అనేక విధములగు క్రిమి జాలములు దాగి యుండి చర్మమునకు దురద, పగుళ్ళు, కలిగిం చుచుపొక్కు గజ్జి, చర్మము రాలుట, చర్మము మంట, చీడ, తామర, పొక్కు, మొటిమలు, పాదము లలో దురద, తదితర లక్షణములను పుట్టించును. సాధారణ చికిత్సం ద్వారా క్రిములు నశించకుండు టచే తాత్కాలిక ఉపశాంతి మాత్రమే కలుగును. శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM)తో వెంటనే క్రిములు నశించుట వలన మీ చర్మము మృదువుగాను,ఉత్రముగాను ఉండుటకు యీ మందు తోడ్పడగలదు. చర్మ వ్యాధులకు కారణమైన క్రిములను నిశ్చయముగా సంహరించు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.

# పాపం! పరంధామయ్య!!

( 11వ పేజి తరువాయి)

కొన్నాడు మనస్సులో. ఆ మధ్యాహ్నం రెండు గంటలనుంచి నాలుగున్నర దాకా ఒక మూల కుర్చీలో పడుకొని కాళ్లు ఎదురుగా ఉన్న టేబుల్ మీద బారజాపి నిద్రపొయ్యాడు.

రోజూ పరంధామయ్య తన సీటు దగ్గరికి వచ్చి కూర్చోవటం, అది పంపారా, ఇది పంపారా అని అడగటం, తనకేదో పని నేర్పటానికి ప్రయత్నంచేయటం ఇదంతా నారాయణమూర్తి కేమీ నచ్చలేదు. 'ఈయనకెందుకు? నాసీటులో పని నా యిష్టం వచ్చినట్టు చేసుకొంటాను. ఇదేమిటి మధ్యలో యీ గొడవ?' అనుకొన్నాడు మనస్సులో. ఆ రోజు సాయంత్రం పరంధామయ్య ఇంటికి వెళ్లాక నారాయణమూర్తి సరాసరి మానేజరు గదిలోనికి వెళ్లాడు. "ఇదేమిటి సార్! రోజూ యీాయన గొడవ ఎక్కువైంది. నాపని పాడయిపోతోంది. పైగా నా సీటుదగ్గర మకాం వేసుకొని కూర్చొని నన్ను సాధిస్తాడేమిటి? ఏదో చెయ్యాలండీ" అన్నాడు మానేజరుతో.

"చేసే దేముంది? నా పనిలో జోక్యం చేసుకోవద్దని ఖచ్చితంగా చెప్పెయ్యండి. అంతే. అయినా యిదేం చాదస్తం! రిటైర్ అయ్యాక హాయిగా యింట్లో కూర్చోక? నేనే చెబుదును గాని మనస్సులో ఏమనుకొంటాడో నని కొంచెం యిదిగా ఉంది!"

"సరేలెండి. నేనే చెబుతాను" అంటూ నారాయణమూర్తి వచ్చి తన సీటులో కూర్చు న్నాడు.

మరునాడు పరంధామయ్య మామూలుగా వచ్చి ఏదో రిపోర్టు వెళ్లిందా అని అడగగానే నారాయణమూర్తి కొద్దిగా చిరాకుతో, "చూడండి పరంధామయ్యగారూ! మరోలాగా అనుకోకపోతే నే నొక విషయం చెబుతాను. ఇట్లా నన్ను రోజూ డిస్టర్బ్ చెయ్యకండి!" అన్నాడు.

"అదేమిటండీ అలా అంటారు?" అన్నాడు పరంధామయ్య తెల్లబోతూ.

"కాకపోతే ఏమిటి చెప్పండి? ఇట్లా నన్ను రోజూ డిస్టర్బ్ చేస్తే నా పని ఎట్లా అవుతుంది చెప్పండి? అయినా రిటైర్ అయిపొయ్యారు కదా? హాయిగా ఇంటిదగ్గర కూర్చోక యింకా యీ అవస్థ ఏమిటి చెప్పండి?"

నిన్న మొన్నటిదాకా తన దగ్గర పనినేర్చుకున్న నారాయణమూర్తేనా యిట్లా మాట్లాడుతున్నాడు-అని పరంధామయ్యకు ఆశ్చర్యంవేసింది. ఆయన ఏదో సమాధానం చెప్పే లోపలే మానేజర్ గొంతు విన్పించింది.

మానేజర్ ఎప్పుడు వచ్చి అక్కడ నిల్చున్నాడో ఏమో? "నిజమేనండీ పరంధామయ్యగారూ? మీరు పెద్దవారనుకోండి. మీకు చెప్పటానికే నాకు కొంచెం జంకుగా ఉంది. అయినా చెప్పక తప్పదు. ఇట్లా అతడి పనిని మధ్యలో పాడు చేస్తుంటే ఎట్లాగండీ?" అన్నాడు.

పరంధామయ్యకు ఇక అక్కడ ఓ క్షణమయినా నిల్చే బుద్ధి పుట్టలేదు. గిరుక్కున వెనక్కు తిరిగాడు. "అయామ్ సారీ. ఇంకా నేను మీకు సహాయకారిగా ఉంటానేమో అనుకొన్నాను" అని చెప్పేసి బయటికి వచ్చాడు.

వెనకనుంచి మానేజరు "మరేమీ అనుకోకండి" అన్నాడు.

పరంధామయ్య సరాసరి ఇంటికి పోలేదు. తాను ఇన్నేళ్ళు సర్వీసు చేశాడు. ఇన్ని సంవత్సరాలు ప్రభుత్వం వారి ఎన్నో వ్యవహారాలుచూశాడు. తన సర్వీసులో ఎన్ని వందల ఫైళ్ళు 'డీల్' చేశాడో! ఇప్పుడు తనకూ ఆ ఆఫీసుకూ ఏ సంబంధమూ లేదు! అదీ తన కళ్లముందు పెరిగిన ఆ నారాయణమూర్తి, ఆ మానేజరు తనకు చెప్పేవాళ్ళా? ఆయన మనస్సు పాడయిపోయింది. అట్లాగే లక్ష్యంలేకుండా ఓ రెండు గంటలు తిరిగి మెల్లగా ఇంటికి చేరుకున్నాడు. నట్టింట్లో మహాలక్ష్మి కమల ఏవో కబుర్లు చెప్పుకొంటున్నారు. మహాలక్ష్మి, చేతిలో ఇన్ని బియ్యం పోసుకొని రాళ్ళు ఏరుతూఉంది. కమల ఏదో కుడుతూఉంది. మామగారిని చూడగానే కమల చటుక్కున లేచి ఇంట్లోకి వెళ్ళింది. మహాలక్ష్మి ఈయన్ను చూసి లేచి నిల్చుంది. "అదేమిటండీ? వచ్చేశారు. ఆఫీసంటే మొహం మొత్తిందా?" అన్నది నవ్వుతూ.

పరంధామయ్య ఆమెకు సమాధానం చెప్పకుండా మౌనంగా లోపలికి వెళ్లాడు. కుర్చీమీద ఉత్తరీయం పడేసి పడక కుర్చీమీద ఉస్సు రంటూ పడుకొన్నాడు.

ఆయన వెనకాలేవచ్చిన మహాలక్ష్మి, "ఏమండీ, అట్లా ఉన్నారెందుకని? అయినా ఇప్పుడు కూడ యింతలేసి ఎండల్లో ఆఫీసుకు వెళ్ళకపోతేనేం?" అన్నది.

మహాలక్ష్మి మాటలకు ఆయన సూటిగా సమాధానం చెప్పకుండానే, "కాఫీవుంటే యివ్వు" అన్నాడు.

"కాఫీ ఎక్కడిదండీ? సుందరం వచ్చేవేళయింది. వాడికోసరం ఎటూ పెట్టాలిగా? ఉండండి. ఇప్పుడే కుంపటి వెలిగిస్తాను" అంటూ ఆవిడ ఇంట్లోకి వెళ్లింది.

'సుందరంకోసరం ఎటూ పెట్టాలిగా? అందులో నాకు కాస్త యిస్తుంది కాబోలు' అనుకొన్నా డాయన. అందులో ఏమీ విపరీతార్థం లేకపోయినా ఆయనకు ఏదో ఉన్నట్టుగా తోచింది. నిజానికి మహాలక్ష్మి మామూలు ధోరణిలో ఆ మాటలు అని వెళ్లింది. ఈయనకు ఎప్పుడూ అయ్యో తాను రిటైర్ అయిపొయ్యానే అని మనస్సులో పీకుతుండటంచేత ఆవిడ మాటలకు ఏవేవో అర్థాలు కన్పించినవి.

ఆ మరునాడు కూడ మామూలుగా పదింటికి భోజనం చేశాడు. ముప్పయి సంవత్సరాలుగా పదింటికి భోజనం చేయటం, ఆఫీసుకు వెళ్లటం అతని జీవితంలో ఒక భాగమయిపోయినవి. గాలి పీల్చటం ఎంత సహజమో యీ రెండు పనులు చేయటము అంత సహజమయి పోయినవి. ఇవ్వాళ పదింటికి భోజనమయితే చేశాడు కాని మళ్లీ ఆఫీసుకు వెళ్లటానికి మనసొప్ప లేదు. అయితే గుంజకు కట్టేసిన కుక్క గొలుసు తెంచుకుని పారిపోవటానికి ఎంత పెనుగులాడుతుందో కాళ్ళు బయలుదేరడానికి అంత పెనుగులాడుతున్నాయి. ఇక ఆగలేకపొయ్యాడు, పరంధామయ్య. లేచి పంచకట్టుకొని లాల్చీవేసుకొని బయలుదేరాడు.

"ఇవ్వాళకూడా ఆఫీసుకే వెడుతున్నారా?" అన్నది మహాలక్ష్మి, ఆయన బయలుదేరటం చూసి.



ఎదురు తెన్నులు

చిత్రం—ఎ.వి. సుందరరావు (రూప్పగూడ)

## విజ్ఞప్తి

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురణార్థం కథలు, గేయాలు, ఫోటోలు, చిత్రాలు మున్నగునవి పంపేవారు పేరు, పూర్తి చిరునామా స్పష్టంగా వ్రాయవలసి ఉన్నది. ప్రచురణకు అంగీకరించే పక్షంలో ఆసంగతి తెలియపరచడము, ప్రచురణార్హం కాకపోతే త్రిప్పి పంపడము దుస్తరం అవుతున్న కారణంచేత ప్రత్యేకంగా ఈ విజ్ఞప్తి చేస్తున్నాము.*

—ఎడిటర్

మీ అందానికి మంచిదారి



మీ జీవిత విజయాలకు అందం అవసరం. ఎండవేడికి యింకా యితరకారణాలవల్ల ముఖం క్రమేపి నల్లబడి, ముదిరూపువస్తుంది. గ్లోరియా అనే ద్రవముయొక్క అద్భుత సౌందర్య పోషకశక్తి మీ ముఖంలోని అసహ్యమయిన ముదిరూపును పోగొట్టి ఆకర్షణీయమయిన లేతదనాన్ని తెస్తుంది. మీ అందం దినాదినాభివృద్ధి అవడానికి నెలకు అధమం కొన్నిసార్లు అయినా గ్లోరియా అనే సౌందర్యపోషక ద్రవాన్ని వాడండి. ముఖంమీద మొటిమలను పోటి మచ్చలను, ముడతలను, నమ్మకంగా పోగొట్టి ముఖాన్ని తెలుపుచేసి, కాంతిని, అందాన్ని తెచ్చును. మొదటి పూతకే మీకు ఆశ్చర్యాన్ని కలిగించే అందాన్ని యిస్తుంది. ఒకసారి వాడి చూస్తే మీరెప్పుడూ విడువరు. అన్నిషాపులలో దొరకును.

జనితా ప్రొడక్ట్సు - ఏలూరు. (ఆంధ్ర)



ఆహార లోటువల్ల
మీరు నీరసించిపోతున్నారా?

ఆల్‌బో-సాంగ్
సేవించండి

దివ్యమైనది మరియు
సామాన్య పోషక ఆహారమును పోదుపుగాను
వైజ్ఞానికంగాను బలపరచును.

టీ, కాఫీ, పాలు, గంజి, పళ్ల రసం మొదలైనవాటితో కలిపితే ప్రీతైన రుచిగలది. ఆల్‌బో-సాంగ్, శిశువులకు, ఎదిగే పిల్లలకు, చంటి బిడ్డ - తల్లులకు, మెదడునుపయోగించే పనివారికి, వృద్ధులకు, బలహీనతకు, రక్తహీనతకు మరియు రోగ విముక్తులై కోలుకుంటున్న వారికి, దివ్యమైనబలవర్ధక ఆహారము.




పొడరుగాను, బిళ్లలుగాను దొరుకు తున్నవి.

జె. అండ్ జె. డిషేన్
హైదరాబాద్


# పాపం!
# పరంధామయ్యా!!

"ఊ" అంటూ బయలుదేరాడు.

"అబ్బ! ఈ తిరగటం ఏమిటండీ? హాయిగా ఇంట్లో కూర్చోరాదా?"

"ఇంకో గంటలో వస్తానుగా" అంటూ బయలుదేరాడు. ఇక ఏమయినాసరే ఆఫీసుకు వెళ్లరాదని ఆయన మనస్సులో గట్టిగా నిశ్చయించుకొన్నాడు. అయితే తన పరాజయం మహాలక్ష్మికి తెలియనివ్వటం ఆయనకు ఇష్టం లేదు.

• • •

పరంధామయ్య రిటైరయి ఇప్పటికి నెల కావచ్చింది. అతడి దగ్గర డబ్బంతా అయిపోయింది. ఇక ఏమిచెయ్యాలో తోచటం లేదు. ఇంట్లో అంతా సుందరమే చూసుకొంటున్నాడు. ఇక తనక్కావలసినా బహుశా సుందరాన్నే అడగాలి. ఛా! తను వెళ్లి డబ్బుంటే ఇమ్మని సుందరాన్ని అడగటమా?

అపూట జేబులో దమ్మిడీ అయినా లేకుండా బజారు వెళ్లాడు. అయితే అట్లా వెళ్లటం ఎంత బాధాకరమో గ్రహించాడు. లాభంలేదు. తాను ఖర్చుపెట్టినా లేకపోయినా తన జేబులో డబ్బు ఉండటానికీ, లేకపోవటానికీ సహస్రాంతం తేడా ఉన్నది. ఇన్ని సంవత్సరాల తర్వాత డబ్బు లేకుండా ఉండటం ఆయనకు పిచ్చెత్తినట్టుగా ఉంది.

"ఏమే, నీ దగ్గర డబ్బేమయినా ఉంటే ఇటుతే" అన్నాడాయన ఇంటికి రాగానే మహాలక్ష్మితో.


"అయ్యో! నాదగ్గ రెక్కడిదండీ?"

"అయితే సుందరాన్నడిగి ఓ పది రూపాయలు తీసుకో." మహాలక్ష్మి మొగుడివేపు ఆశ్చర్యంగా చూచింది. "అదేమిటండీ? నేను అడగటం ఏమిటి?" అన్నది.

"కాదులే. నువ్వే అడుగు."

మహాలక్ష్మి వెళ్లి సుందరంతో "సుందరం, మీ నాన్నకు ఓపదిరూపాయలు కావాలిట. ఇవ్వరా" అని అడిగేసరికి సుందరంకూడ ఆశ్చర్యపోయ్యాడు. అతడికి తండ్రి మనస్సులో భావం చటుక్కున అర్థమయింది. 'ఛీ! తానే పొరపాటు చేశాడు. జీతం రాగానే ఏదో కొద్దిగా తాను ఉంచుకొని మిగతాది తండ్రికి ఇచ్చిఉంటే ఎంత బాగుండేది. ఇప్పుడాయన జేబులో ఏమీ లేకపోవటంచేత ఎంత బాధపడుతున్నాడో' అని మనస్సులో తన్ను తానే తిట్టుకొని పర్సులోంచి రెండు పదులు తీసి తల్లి కిచ్చాడు.

ఆ రోజంతా సుందరం తండ్రికి కనబడితే ఏదో తప్పుచేసిన వాడిలాగా తలవంచుకొని వెళ్లిపొయ్యేవాడు. పరంధామయ్యా అంతే. కొడుకు



శ్రీ రంగనాథాలయ స్వర్ణ విమానం (శ్రీరంగం) ఫోటో—కె. సీతారామన్ (తిరుప్పూరు)

కనబడితే సూటిగా అతడివంక చూడటానికి మనసొప్పక తల తిప్పుకొనే వాడు.

పరంధామయ్యకు ఏదో అవసరం వచ్చి పది రూపాయల నోటు మారుస్తుంటే మనస్సు చివుక్కు మన్నది. ఆ పదిరూపాయలు తనవి కావనే భావన ఎంత వద్దన్నా మనస్సులోంచి తీసివెయ్యలేకపొయ్యాడు.

• • •

"మీకు తెలియనట్టు మాట్లాడుతారేమండీ, పరంధామయ్యగారూ! ప్రావిన్షియల్ గవర్నమెంటు ఎంప్లాయికీ రిటైరయ్యాక పెన్షన్ ఇంత త్వరగా ఎట్లా వస్తుందండీ? ఇప్పుడు మీరు రిటైరయి నాలుగు నెలలేకదా అయిందీ...."

మానేజరు మాటలు వింటూ పరంధామయ్య తెల్లబోయాడు. నిరాశపడ్డాడు. పెన్షను ఇంత తొందరలోరాదని ఆయనకు తెలియని విషయం కాదు. ఇప్పుడు మానేజరు అన్నమాటలే తాను ఇది వరకు ఎంతమందితోనోఅన్నాడు. ఇంకాచెప్పాలంటే ఆ మాటలే ఇంకా కొంచెం ఘాటుగానూ, విసుగు తోనూ అన్నాడు కూడ.

'ఛీ! ఎంతపని చేశాను. కొంత డబ్బయినా బ్యాంకులో వేసిఉండవలసింది. ఎంత తెలివి తక్కువపని చేశాను....' అని తన్ను తాను తిట్టుకొంటూ ఇంటికి బయలుదేరాడు. దారిలో తన చొక్కా చినుగు కనబడ్డది. వెధవది, ఎంత దాచుకోవాలన్నా చినుగు బయటపడుతూనే ఉంది.

దారిలో గుడ్డల కొట్టు దగ్గరికి వచ్చేసరికి కాళ్ళు బ్రేకులు పడ్డట్టుగా ఆగిపోయినవి. జేబులో పది రూపాయల నోటు ఉంది. జీతం రాగానే సుందరం తండ్రికి రెండు పదులు ఇస్తూనే ఉన్నాడు. పరంధామయ్య "నా కెందుకులేరా?" అన్నా సుందరం ఊరుకోలేదు. "ఫరవాలేదులే నాన్నా. అంతగా కావలసివస్తే నేను మళ్లీ అడిగి తీసుకుంటానుగా" అన్నాడు. ఆ డబ్బులో ఇప్పుడు పది మిగిలింది. పరంధామయ్య జేబులో చెయ్యిపెట్టి నోటును తడిమి చూశాడు. 'అయ్యో ఇది కాస్తా ఖర్చుపెడితే..' అన్న అనుమానం వచ్చింది. నిజాని కాయనకు ఖర్చు ఏముంటుంది? అయినా డబ్బు జేబులో ఉండటంవేరు. ఉన్నప్పుడు ఆ ధైర్యం, ఆనందం డబ్బు జేబులో లేనప్పుడు ఏ ముంటుంది?

ఇంటికి వెళ్లగానే వాకిట్లోనే సూరిబాబు ఎదురయ్యాడు. "నాన్నా! నాకు అర్జెంటుగా అయిదు రూపాయలు కావాలి నాన్నా. ఎక్స్‌కర్షన్‌కు వెళ్లాలి. స్కూల్లో అందరూ వెడుతున్నారు. ..."అన్నాడు.

పరంధామయ్య ఏదో జవాబు చెప్పే లోపలే లోపలినుంచి మహాలక్ష్మి వచ్చి, "వెధవా! అన్నయ్యను రానీరా, అడిగి ఇస్తానని చెప్పలేదూ? నాన్నగారి నడిగితేమటుకు ఆయన దగ్గ రెక్కడుంటాయి" అని కొడుకుని కసురుకుని భర్త వంక తిరిగి. "మీరు రండి, సాయంత్రం సుందరం రాగానే అడిగి తీసుకొని వీడికిస్తాను. తొందరగా నీళ్ళు పోసుకోండి. అన్నం వడ్డిస్తాను" అన్నది.

మహాలక్ష్మి సూరిబాబును కసురుకుంటూ అన్న మాటలు వింటూంటే పరంధామయ్య ముఖం నల్లగా మాడిపోయింది. ఆయన వెంటనే జేబులోనుంచి పది రూపాయల కాగితం తీసి కొడుకుకు ఇస్తూ "వెళ్లి మార్పి,నువు అయిదు తీసుకో" అన్నాడు.

"అయ్యో అదేమిటండీ...." అని మహాలక్ష్మి ఇంకా ఏదో అంటూఉన్నా విన్పించుకోకుండా ఇంట్లోకి వెళ్లిపోయాడు ఆయన.

ఆ సాయంత్రం పరంధామయ్య బజారులోకి వెళ్ళి, "విశ్వభారతి ఫ్యాన్సీ స్టోర్సు"లో అడుగు పెట్టాడు. ఈయన సర్వీసులో ఉండగా వాళ్లకు ఎంతో సహాయం చేశాడు.

ఈయన్ను చూడగానే ప్రొప్రయిటరు కొడుకు మర్యాదతో, "రండి, రండి" అని ఆహ్వానించాడు.

మాటల సందర్భంలో పరంధామయ్య, "ఏమండీ, మీ కంపెనీలో నాకేదయినా ఉద్యోగం ఇవ్వరాదా?" అన్నాడు.

ఆయన ఆశ్చర్యంతో, "అదేమిటీ? మీరు మా కంపెనీలో ఉద్యోగంచేస్తారా?" అన్నాడు.

"ఎందుకు చేయరాదండీ? మీరివ్వాలేగాని నేను చేయటానికేం?"

పరంధామయ్యకు ఉద్యోగం యిస్తే ప్రభుత్వ కార్యాలయాల్లో తమకు జరుగవలసిన పనులు తొందరగా జరుగుతాయని ఆ ప్రొప్రయిటరు కొడుక్కు బాగా తెలుసు.

"దానికేమండీ? నాన్నగారికి చెప్పి మీకు మా హెడ్ ఆఫీసులో మానేజరు పోస్టు యిప్పిస్తాను. రేపు సోమవారం నుంచి చేరవచ్చు" అన్నాడు.

"అట్లాగేనండి. అసలు నాన్నగారు ఉంటారనే ఇక్కడికి వచ్చాను. అంతగా అయితే ఇప్పుడే వెళ్లి నాన్నగారితో మాట్లాడుతాను" అంటూ పరంధామయ్య సంతోషంతో, తేలికబడ్డ మనస్సుతో లేచాడు. ★